క్లుప్తంగా

వలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



పొన్నూరు: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ బొమ్మ వద్ద గురువారం వలంటీర్లు ఆందోళన చేశారు. నల్ల రిబ్బన్లను కళ్లకు కట్టుకుని నిరసన తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దె వెంకట భవాని ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వలంటీర్లను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గత ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు షేక్ జాని, గోపి, బాజీ, మహేశ్వరి, పర్వీన్, వలంటీర్స్ అసోసియేషన్ పట్టణ గౌరవాధ్యక్షులు ఆరేటి రామారావు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ



ప్రత్తిపాడు: స్థానిక పంచాయతీ అధికారులు డోర్ టు డోర్ చెత్తసేకరణపై దృష్టి సారించారు. పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో గ్రామంలో ఇంటింటికీ తిరిగి పారిశుద్ధ్య సిబ్బంది చెత్త సేకరించడం లేదని ఉప సర్పంచ్ సహా వార్డు సభ్యులంతా అధికారులను ముక్తకంఠంతో ప్రశ్నించారు. దీంతో గురువారం పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా సేకరించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



ప్రత్తిపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో అన్నదమ్ములు షేక్ జాన్ సాహెబ్, షేక్ చిన్నబాబు, పెద్దబాబు, షేక్ మహబూబ్ సుభానీలు నివాసముంటున్న పెంకుటిల్లు బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో ఆయా పోర్షన్లలో ఉన్న విలువైన వస్తువులు, సామాన్లు, పత్రాలు, ఎలక్ట్రికల్ సామానులు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందించడంతో గుంటూరు–2 ఫైర్‌స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

30న అన్నమయ్య గీతాల సహస్ర గళార్చన



నగరంపాలెం: గుంటూరు లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 30న శ్రీవెంకటేశ్వర స్వామికి గళార్చనతో నీరాజనం నిర్వహిస్తున్నట్లు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ తెలిపారు. పాఠశాల ఆవరణలో గురువారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ తానా, దర్శనం టీవీ చానెల్ సంయుక్తంగా నీరాజనం నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఏకగళంతో అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తారని, సుమారు 4 వేల మంది హాజరవుతారనే అంచనా ఉందని పేర్కొన్నారు. వెయ్యి మందితో అన్నమయ్య గీతాల సహస్ర గళార్చన నిర్వహిస్తామని తెలిపారు. పాల్గొనే వారు ఈనెల 25లోగా మొబైల్ రిజిస్ట్రేషన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. తెలుగు వారి లోక కల్యాణార్థం సప్తగిరి కీర్తనలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం ఐదు నుంచి ఎనిమిది గళార్చన కొనసాగుతుందని వెల్లడించారు. ముఖ్య అతిథులుగా టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పలువురు హాజరవుతారని తెలిపారు. దర్శనం టీవీ చానల్ ప్రతినిధులు మహేష్ ధీరా, బండ్లమూడి స్వామి, తానా మాజీ కార్యదర్శి కొల్లా అశోక్ పాల్గొన్నారు.

రైతులకు ఎరువు బరువు

- డీఏపీ కోసం ఎదురుచూపులు
- మార్కెట్ యార్డు ముందు పడిగాపులు
- రిటైర్ వ్యాపారుల వద్ద కూడా స్టాక్ కరువు



పెదనందిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డులో డీఏపీ కోసం ఎగబడుతున్న రైతులు

ప్రత్తిపాడు: డీఏపీ కొరత రైతులను వేధిస్తోంది. పెదనందిపాడు మండలంలో సరిపడినంత లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు జీడీసీఎంఎస్‌కు స్టాక్ వస్తుందో తెలియక దిక్కులు చూస్తున్నారు. మండలంలోని రైతు సేవ కేంద్రాల్లోనూ డీఏపీ జాడలు కనిపించడం లేదు. బహిరంగ మార్కెట్‌లో రిటైర్ వ్యాపారుల వద్ద కూడా స్టాక్ అందుబాటులో లేని పరిస్థితి. దీంతో ఈ ప్రాంత రైతులంతా పెదనందిపాడు, పుసులూరు, ఉప్పలపాడు జీడీసీఎంఎస్ (గుంటూరు డిస్ట్రిక్ట్ కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ)ల పైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా జీడీసీఎంఎస్‌లకు చెందిన వ్యవసాయాధికారులు అరకొరగా స్టాక్ తెప్పిస్తున్నప్పటికీ రైతులకు సకాలంలో సరిపడినంత డీఏపీని అందించలేకపోతున్నారు. పెదనందిపాడు సొసైటీ ద్వారా బుధవారం 20 మెట్రిక్ టన్నుల డీఏపీని వ్యవసాయశాఖ అధికారులు తెప్పించారు. దీంతో గురువారం తెల్లవారుజాము నుంచే రైతులు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ట్రాక్టర్లతో పడిగాపులు కాయాల్సి వచ్చింది.

వైఎస్సార్ సీపీ హయాంలో సమృద్ధిగా ఎరువులు

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే రైతు సేవ కేంద్రాలలో ఎరువులు, డీఏపీలను సమృద్ధిగా అందుబాటులో ఉంచింది. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం రైతుల అవసరాలను పూర్తిగా విస్మరించింది. రైతులకు సకాలంలో ఎరువులను అందించడంలో విఫలం చెందింది. ఇప్పటికే ఎరువుల కొరత ఉందని స్థానిక వ్యవసాయ అధికారులు ఇటీవల మండలంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ స్టాకు అరకొరగానే వస్తుండటంతో రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.



ట్రాక్టర్లలో డీఏపీ బస్తాలను ఎక్కించుకుంటున్న రైతులు

ఆర్‌వీఆర్‌జేసీలో ఫార్మాథాన్- 2024 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: తమ కళాశాలలోని ఆర్‌జేఈ నెస్ట్ (ఆర్‌వీఆర్‌జేసీ, సీఈఎస్‌టీపీ ఫౌండేషన్), చిప్స్ (చేబ్రోలు హనుమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసిటికల్ సైన్సెస్) సంయుక్త సహకారంతో ఫార్మాథాన్- 2024 జాతీయ స్థాయి ప్రొటోటైప్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. చౌడవరంలోని కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, చిప్స్ కళాశాల సిబ్బందితో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియకి సంబంధించిన వెబ్ సైట్‌ను ప్రారంభించారు. తమ కళాశాల వేదికగా జరిగే జాతీయస్థాయి పోటీలలో ఫార్మా, వైద్య రంగాలకు సంబంధించిన నూతన ఆవిష్కరణల ప్రదర్శనకు దేశ నలుమూలల నుంచి విద్యార్థులు రావడం ఆనందదాయకమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. ఆర్‌వీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం డిసెంబర్ 12న జరిపే ప్రాథమిక దశ ఎంపికలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డిసెంబర్ 21న జరిగే ఫైనల్స్‌కి చేరుతారని తెలిపారు. ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామని చెప్పారు. అంకుర పరిశ్రమల స్థాపనల వరకు ప్రోత్సహించేందుకు వారి ప్రొటోటైప్‌లను ప్రొడక్ట్ దశకు వెళ్లేందుకు కళాశాల ఇంక్యుబేషన్ సెంటర్ నుంచి రూ. 10 లక్షల వరకు ఇగ్నీషియం గ్రాంట్ ద్వారా నగదును కూడా అందజేయనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ ప్రొటోటైప్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె. రవీంద్ర, కళాశాల ఏవో డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎమ్‌వీపీ చంద్రశేఖర్, మహేంద్రవర్మ, సజ్జా రాధిక, వీఎస్ఎన్ మల్లేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు ఈసీ కౌన్సిల్ అవార్డ్



సర్టిఫికెట్ పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: చలపతి ఇంజనీరింగ్ కళాశాలకు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఈసీ కౌన్సిల్ అవార్డు రావటం ఎంతో గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఈ కామర్స్ కన్సల్‌టెంట్స్(ఈసీ కౌన్సిల్)లో 87 దేశాలకు చెందిన కళాశాలలు పాల్గొన్నాయన్నారు. ఇందులో తమ కళాశాలకు అకాడెమియా బెస్ట్ న్యూకమర్ 2024 గ్లోబల్ అవార్డు దక్కిందని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో విద్యార్థులకు నైపుణ్యతలను మెరుగుపరిచేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ద్వారా తమ కళాశాల విద్యార్థులకు శిక్షణ ఇప్పించినట్లు చెప్పారు. ఆయా రంగాల్లో తమ విద్యార్థుల ప్రతిభకు ఈ అవార్డు దక్కిందని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, సీఎస్‌ఐటీ బ్రాంచ్‌లలో అంతర్జాతీయ సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్ సర్టిఫికెట్‌లను 15 మంది విద్యార్థులు అందుకున్నారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై. సుజిత్‌కుమార్ తెలిపారు. విద్యార్థులకు జాతీయ అంతర్జాతీయ కోర్సుల్లో ప్రావీణ్యత పొందేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ పొందిన విద్యార్థులను, అవార్డును సాధించే విధంగా తర్ఫీదునిచ్చిన అధ్యాపకులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

విద్యార్థులకు 'అపార్' కష్టాలు

- దస్త్రాల్లో తప్పులతో ఆలస్యం
- ఆధార్ సెంటర్‌ల వద్ద విద్యార్థుల పడిగాపులు

పొన్నూరు మండలంలో విద్యార్థులు ఇలా..	
ప్రభుత్వ పాఠశాలలు	88
ప్రైవేటు పాఠశాలలు	30
కళాశాలలు	4
మొత్తం విద్యార్థుల సంఖ్య	15,884
ఆపార్ నమోదు అయినవి	11,851
అపార్ పెండింగ్‌లో ఉన్నవి	4,033
పూర్తయిన శాతం	74.61

పొన్నూరు: ఒక దేశం.. ఒకే విద్యార్థి విధానం పేరిట జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్రం తెచ్చిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) నమోదు సమస్యలతో ఆలస్యంగా సాగుతోంది. ఈ విధానంలో విద్యార్థి పేరు, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్, విద్యార్థికి సంబంధించిన ఇతర ధ్రువీకరణ పత్రాలు అన్నీ సరిపోయే విధంగా ఉండాలి. లేనిపక్షంలో అపార్‌లో డేటా అప్ లోడ్ కాని పరిస్థితి. దీనితో ఏ చిన్న తప్పు ఉన్నా ఆధార్ కేంద్రం, స్కూల్ యాజమాన్యం, ఎంఈవో కార్యాలయం చుట్టూ తల్లిదండ్రులు తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ దస్త్రంలోనైనా విద్యార్థి, పేరు, ఇంటి పేరు, తల్లిదండ్రుల పేరు, లింగం వంటి వాటిలో ఉండే తప్పుల్లో ఒక అక్షరం వరకు మార్పు చేయడానికి విద్యార్థి చదివే తరగతిని బట్టి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవోకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఒక అక్షరం కంటే ఎక్కువ తప్పులు ఉన్నా, ఇతర పత్రాల్లో తప్పులున్నా వాటిని విద్యార్థే(తల్లిదండ్రులు) సరిచేసుకోవాల్సి ఉంటుంది. దీనితో అపార్ ప్రక్రియ ఆలస్యమవుతోంది.



ఆధార్ సెంటర్‌లో నమోదును పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

అపార్‌తో విద్యార్థులకు మేలు

ఒకసారి అపార్ ప్రక్రియ పూర్తయితే విద్యార్థి చదువుకు సంబంధించిన పత్రాలు పట్టుకుని తిరగాల్సిన పరిస్థితి ఉండదు. విద్యార్థుల పరీక్షలు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే సమయంలో పరిశీలన కోసం సమయం వృథా కాకుండా ఉంటుంది. ఇప్పటి వరకు అపార్ నమోదుకు ప్రభుత్వం ఎలాంటి గడువు నిర్ణయించ లేదు.

–శ్రీనివాసరెడ్డి, విద్యాశాఖాధికారి, పొన్నూరు

పలుచోట్ల ఆధార్ సెంటర్లు

ఆధార్ కేంద్రాల నిర్వాహకులు విద్యార్థుల నుంచి అధిక మొత్తం డిమాండ్ చేయడాన్ని అధికారులు గుర్తించి ఈ నెల 29 వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఆధార్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. 22న నిడుబ్రోలు జెడ్పీ పాఠశాల, ఏపీ స్కూల్, 26, 27,28, 29న వివేక ఎలిమెంటరీ స్కూల్‌లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

రోడ్ల వెంబడి వ్యర్థాలు



ప్రత్తిపాడు: సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్లు ఉన్నప్పటికీ వ్యర్థాలను డంప్ చేసేందుకు రోడ్డు మార్జిన్లే దిక్కవుతున్నాయి. ఇక్కడ కనిపిస్తున్న ఈ చిత్రం కూడా అలాంటిదే. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ ఉన్నప్పటికీ చెత్త చెదారాలను ఇదిగో ఇలా రోడ్డు వెంబడి పడేస్తున్నారు. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారవుతోంది. మండలంలో రెండవ మేజర్ పంచాయతీ అయినప్పటికీ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను సక్రమంగా వినియోగంలోనికి తీసుకురాకపోవడంతో ఇలా రోడ్ల వెంట మార్జిన్లలో వ్యర్థాల కుప్పలు కనిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం యనమదల 16వ నంబరు జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు అతివేగంగా, అజాగ్రత్తగా వెళుతున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాల పాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగేంద్ర ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. సిబ్బందితో కలిసి మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్ కు తరలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉండవచ్చని, ప్రమాదం జరిగిన సమయంలో సిమెంటు కలర్ చొక్కా ధరించి, కండువా వేసుకుని మాసిన గడ్డంతో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ప్రత్తిపాడు పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కె. నాగేంద్ర కోరారు. యనమదల గ్రామ వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కంప్యూటర్ ఆపరేటర్‌కు తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో కంప్యూటర్ ఆపరేటర్‌కు తీవ్ర గాయాలైన ఘటన పాత మద్రాసు రోడ్డుపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పెదనందిపాడు మండలం గోగులమూడి గ్రామానికి చెందిన పఠాన్ జిలాని గుంటూరు నగరంలోని ఒక పొగాకు కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్నాడు. ప్రతిరోజూ స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై డ్యూటీకి వెళ్లి తిరిగి ఇంటికి వస్తాడు. ఎప్పటిలానే ఈ నెల 19వ తేదీ రాత్రి డ్యూటీకి వెళ్లి ముగించుకుని తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై తిక్కిరెడ్డిపాలెం బస్ షెల్టర్ సమీపంలో గ్రామంలో నుంచి మెయిన్ రోడ్డుపైకి వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం అతివేగంగా, వచ్చి జిలాని నడుపుతున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న జిలాని ప్రస్తుతం మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. దీంతో గురువారం అతడి తల్లి ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ కె. నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



కాకుమాను: గ్రామాల్లో మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా పోలీస్ సిబ్బంది వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గుంటూరు సౌత్ సబ్ డివిజన్ పోలీస్ అధికారి పి.మల్లికార్జునరావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేషన్‌కు వివిధ సమస్యలపై వచ్చే మహిళలకు అండగా ఉండాలని తెలిపారు. మండలంలోని పెద్దల సహకారాలతో పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు పరిశీలించారు. కాకుమాను,పెదనందిపాడు మండలాల మహిళా పోలీసులకు పలు సూచనలు చేశారు.

అదనపు వసూళ్లపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

ప్రత్తిపాడు: పదో తరగతి పరీక్ష ఫీజులు అదనంగా వసూళ్లు చేయడంపై డెప్యూటీ విద్యాశాఖాధికారి పి. వెంకటేశ్వరరావు విచారణ ప్రారంభించారు. మండలంలోని పెదగొట్టిపాడు, పాతమల్లాయపాలెం, కోయవారిపాలెం, యనమదల, తిక్కిరెడ్డిపాలెం, వంగిపురం హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు స్కానింగ్, ప్రింటింగ్, ఆన్‌లైన్ వర్క్, ఫోటోల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ. 25 నుంచి రూ. 150 వరకు పరీక్ష ఫీజు కన్నా అదనంగా వసూళ్లు చేస్తున్నారంటూ బుధవారం 'సాక్షి'లో 'పది' ఫీజు అ'ధనం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పందించిన డీఈవో అదనపు వసూళ్లపై విచారణ అధికారిని నియమించి, విచారణ చేయిస్తానని తెలిపారు. దీంతో గురువారం ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరావు, గొట్టిపాడు, పాతమల్లాయపాలెం పాఠశాలల్లో ఎంఈవో సీహెచ్ రమాదేవితో కలిసి విచారణ చేశారు. గొట్టిపాడు, పాతమల్లాయపాలెం ఇన్‌చార్జి హెచ్‌ఎంల నుంచి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. అనంతరం వంగిపురం హైస్కూల్ హెచ్‌ఎంను ఎంఆర్సీకి పిలిపించి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. విచారణలోనూ ఓ హెచ్‌ఎం అదనంగా డబ్బులు తీసుకున్నట్లు రాసి ఇచ్చారని, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఇచ్చిన స్టేట్‌మెంట్లును డీఈవోకు అందించనున్నట్లు డెప్యూటీ ఈవో వెంకటేశ్వరరావు తెలిపారు.



గొట్టిపాడు హైస్కూల్లో విచారణ చేస్తున్న డెప్యూటీ విద్యాశాఖాధికారి పి. వెంకటేశ్వరరావు

ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్ సీపీ అండ



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్ తదితరులు

నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులోగల ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామాల్లో, మండలాల్లో ప్రస్తుతం ఉన్న సమస్యలను ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకు వచ్చారు. సంబంధిత అధికారులతో కిరణ్‌కుమార్ మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, తన దృష్టికి వచ్చిన పలు సమస్యలపై స్పందించి వారికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీఇచ్చారు. నియోజకవర్గంలోని కార్యకర్తలపై గానీ, సోషల్ మీడియా కార్యకర్తలపై గానీ అక్రమ కేసులు పెడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ పార్టీ తరపున సహాయసహకారాలు అందిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వంఎన్నికల హామీలు అమలు చేయలేక వైఎస్సార్ సీపీ కార్యకర్తలను బెదిరింపులకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మళ్లాలి

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు రూరల్: ప్రకతి వ్యవసాయ అధికారులకు జరుగుతున్న ఐదురోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం వట్టిచెరుకూరు మండలంలోని వట్టిచెరుకూరులో నాదెండ్ల ధనుంజయరావు, పెట్టుబడిలేని పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న నరేష్, ఇతర రైతుల ప్రకృతి వ్యవసాయ పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు గురువారం సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి అనుభవాన్ని తెలుసుకున్నారు. రసాయన పద్ధతులు వాడిన పొలాలు పడిపోవటం, ప్రకృతి వ్యవసాయ పొలాలు పడకుండా ఉండటాన్ని చూసి రైతులతో మాట్లాడారు. తక్కువ ఖర్చుతో కూడిన పర్యావరణ అనుకూల పద్ధతుల్ని ఆచరించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ వరి పొలంలో పిలకలు ఎక్కువగా ఉండటాన్ని గమనించారు. కంకిలో గింజలు కూడా ఎక్కువగా ఉండటాన్ని గమనించి క్షేత్ర దినోత్సవం రైతులు సమక్షంలో జరుపుకోవాలని సూచించారు. డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో వేర్లను మట్టి పట్టి ఉంచే శక్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. గట్లపై మొక్కలు, కూరగాయలు పెంచడం వల్ల జీవ వైవిధ్యమే కాకుండా అదనపు ఆదాయం కూడా వస్తుందని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ర్యాలీ, సభలను జయప్రదం చేయండి

పెదకాకాని: కార్మికుల సమస్యలపై ఈనెల 26న జరిగే ర్యాలీ, సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. పెదకాకాని సీఐటీయూ కార్యాలయంలో గురువారం అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. శివాజీ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు పూనుకుందని తెలిపారు. దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని చెప్పారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, హమాలీ, ఆటో, రవాణా రంగం తదితర అసంఘటితరంగ కార్మికులకు సమగ్రత సామాజిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు శంకర్ విలాస్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు జరుగు ర్యాలీ, బహిరంగ సభలో కార్మికులు, ఉద్యోగ సంఘాలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నాయకుడు కూరపాటి కోటయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి దీవి నరసింహారావు, కె. సత్యనారాయణ, వి. శివయ్య, బి. బాబూరావు, బి. సాంబయ్య, ఏసుపాదం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోరంట్లలో ఏలూరి బ్యాంకు శాఖ ప్రారంభం

గుంటూరు రూరల్: ఏలూరి బ్యాంకు ఖాతాదారులకు ఉత్తమ సేవలందించి, అభివృద్ధి చెందాలని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. గోరంట్లలోని ఇన్నర్‌రింగ్ రోడ్డులో గురువారం బ్యాంకు గోరంట్ల శాఖను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా కోఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో గుంటూరు జిల్లాలో ఏలూరు బ్యాంకు కొనసాగడం అభినందనీయమన్నారు.బ్యాంకును సమర్ధవంతంగా నిర్వహించడంలో చైర్మన్ ఏలూరు గురవయ్య సఫలీకృతులయ్యారని కొనియాడారు. బ్యాంకు చైర్మన్ గురవయ్య మాట్లాడుతూ ప్రారంభం నుండి శ్రద్ధతో ప్రతిరోజూ బ్యాంకు పని విధానాలను మెరుగు పరుచుకుంటూ వినియోగదారులకు ఉత్తమ సేవలందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఖాతాదారులు, పారిశ్రామికవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి బ్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్